శీర్షం కథ

# మనిషి

-టి.వి. పద్మావతి

ఎర్ర తురాయి పువ్వు రాలి మీద పడింది.

వెన్నెల కాంతితో మెరుస్తున్న ఆ పూవును చేతిలోకి తీసుకుని అలవాటుగా అటు చూశాను.

అల్లంత దూరంలో వున్న ఆ సిమెంటు బెంచీ ఖాళీగా వుంది.

వారం రోజులైంది. ఇన్ని రోజులుగా వాళ్ళు రాకుండా ఎప్పుడూ వుండలేదు. వారంలో రెండు మూడు సాయంత్రాలు వాళ్ళు టంచన్‌గా వచ్చి తీరాల్సిందే.

అతను చామనఛాయలో చురుగ్గా, బలంగా వుంటాడు. ఆమె పెద్ద కళ్ళతో దబ్బపండు ఛాయలో అందంగా మృదువుగా వుంటుంది.

వచ్చీపోయే రైళ్ళను చూస్తూ కులాసాగా కబుర్లు చెప్పకుంటూ, నా టైంకి కాస్త ముందుగా లేచిపోతుంటారు.

ఈ మధ్య కాలంలోనే నాకు ఇలా స్టేషన్‌కి వొచ్చి కూచోటం అలవాటైంది. కళ్ళుండి చూడాలేగాని లోకమంతా ప్లాట్‌ఫారమ్ మీదే కనిపిస్తుంది. రకరకాల మనుషులు, మన స్తత్వాలు – పిడుగు పడినా చలించని గుండెలు, చిన్న విషయానికే కలవరపడే మనసులు. ఆగి, పోతున్న ట్రైన్లు – రంగు రంగుల ఆడాళ్ళు, ఒకే ముఖం కలిగిన మగాళ్ళు. గార్డు విజిల్, పచ్చ జెండా, రైలు కూత... భలేగా వుంటుంది.

ఇవన్నీ చూట్టానికి చూసి ఆనందించటానికి తీరికలేదు ఈ టీ.వీ. ముఖం కలిగిన మనుషులకు, ముఖ్యంగా కుర్రాళ్ళకి. అందుకు విరుద్ధంగా వచ్చి కూచొని ఎంజాయ్ చేసి పోతుంటారు ఆ జంట.

కొత్త జంటలా వుంది. మంచి 'టేస్ట్' అని మెచ్చుకున్నాను.

వాళ్ళు ప్లాట్‌ఫారమ్ మీదకు రావడం ప్రారంభించిన నాలుగైదు వారాలకి అతను షాపింగ్‌లో కలిశాడు.

చిరునవ్వుతో పలకరించాను.

అతను కూడా కమ్మటి నవ్వు నవ్వాడు.

అంతే!

అంతకుమించి మా మధ్య పరిచయం లేదు. తర్వాత మా సాయంకాలపు స్థలంలో కనిపించినప్పుడు అతని పెదాలపై విరిసిన నవ్వుతో పాటు గౌరవం నిండిన చూపులు నాకు చాలా ఇష్టం కలిగించేవి. బహుశా ఆ గౌరవం సగం తెల్లబడిన నా జుట్టుకు కావచ్చు.

ఆమె వొద్దికగా అతనిలో వొదిగినట్లు కూచునేది. ఎప్పడైనా చేతిలో పొట్లాం విప్పి, పెదవులు విడివడకుండా తింటూ, కొంచెం ఆకాశంవైపు చూస్తూ, ట్రైన్ శబ్దానికి మరింతగా అతని దగ్గరకు చేరేది. ఒకసారి అతను చిన్న పొట్లం నా చేతిలో పెట్టి, నవ్వి వెళ్ళాడు.

గుగ్గిళ్ళు.

ఆశ్చర్యంతో నోరు తెరిచాను. బంతి పువ్వులు, వేప చెట్లు, గుగ్గిళ్ళు ఇంకా వున్నాయా? ఆంధ్రదేశంలో. వాళ్ళంటే మరింత ప్రేమ కలిగింది గుండెలో. ఆ జంట కనిపించకపోతే ఏదో వెలితిగా వుండేది. అలాంటిది వారం రోజులుగా కనిపించకపోయేసరికి పిచ్చెక్కినట్లైంది.

ఇన్ని రోజులు రాకుండా ఎప్పుడూ లేదు.

అతనికి బాగాలేదో ఏమో పాపం!

ఆమె ఎట్లా వుందో!

లేకుంటే – వూరెళ్ళారా? ఈ సమాధానం ఎంతకీ నచ్చేది కాదు నాకు.

●●

ఆమె వొద్దికగా అతనిలో వొదిగినట్లు కూచునేది. ఎప్పడైనా చేతిలో పొట్లాంవిప్పి, పెదవులు విడివడకుండా తింటూ, కొంచెం ఆకాశంవైపు చూస్తూ ట్రైన్ శబ్దానికి మరింతగా అతని దగ్గరికి చేరేది. ఒకసారి అతను చిన్న పొట్లం నాచేతిలో పెట్టి నవ్వి వెళ్ళాడు. గుగ్గిళ్ళు! ఆశ్చర్యంతో నోరు తెరిచాను. బంతిపువ్వులు, వేపచెట్లు, గుగ్గిళ్ళు ఇంకా వున్నాయా ఆంధ్రదేశంలో?

నా ఆలోచనలతో నిమిత్తం లేకుండా మరో వారం గడిచిపోయింది. అతను ఎక్కడైనా కనిపిస్తాడేమోనని నా కళ్ళు ఆశతోనాలుగు వైపులా గాలించేవి. అతని గురించి తెలుసుకోనందుకు నా మీద నాకే కోపం వచ్చేది.

ఏ పని చేస్తున్నా చిత్రంగా మనసు వాళ్ళవైపు వెళ్ళేది.

ముందు వున్న ప్రశాంతత లోపించింది నాకు అక్కడ.

ఆలోచిస్తూ లేచి నిలబడ్డాను.

ఎదురుగా అతను. నవ్వుతూ వొస్తున్నాడు.

నేను చాలా హాయిగా, ఇష్టంగా అతనివైపు చూశాను.

"నమస్కారం! మాస్టారూ" అంటూ ప్రక్కనే కూచున్నాడు.

నేను కూడా కూర్చుని –

"ఏమిటి? ఒంటరిగా వొచ్చినట్లుంది?" అడిగాను.

తల అడ్డంగా వూపి దూరంగా చూపించాడు.

ఆమె, ఎవరో ఇద్దరు ముగ్గురు ఆడాళ్ళ మధ్య నిలబడి వుంది. అందరూ మాటల్లో వున్నారు.

"వూరు ప్రయాణమా?"

"లేదు మాస్టారూ! ఎప్పటిలాగే వొచ్చాం. తెలిసిన వాళ్ళు కనిపిస్తే మాటల్లో వుండిపోయాం. మిమ్మల్ని చూసి వొచ్చాను. చాలా రోజులైంది కదూ!" అన్నాడు.

**20 సంవత్సరాలు కాపురం చేసి చిన్న అనుమానంతో భార్యతో మాటలు లేకుండా, సాయంకాలాలు ఇట్లా స్టేషన్ దగ్గరికి వచ్చి కూచుంటున్న మామూలు మొగాన్ని, మొగుణ్ణి నేను. ఆ కుర్రాడికి ఏమని సమాధానం చెప్పగలను? కనీసం ఇకనుంచైనా నా భార్యను కూడా ఇలా సాయంకాలాలు హాయిగా గడపడానికి తీసుకు వస్తానని ఎట్లా చెప్పగలను?**

"అవును. ఏమిటి కారణం?" అడక్కుండా వుండలేకపోయాను.

దూరంగా వున్న భార్య వొంక చూసి, నా వైపు మొహం త్రిప్పి అన్నాడు "చిన్న విషయం జరిగింది."

ఆ వెలుగు నీడల సమయంలో అతని ముఖం శాంతంగా కనిపించింది.

"ఏం లేదు మాస్టారూ! వింటే మీరు నవ్వుతారు"

"చెప్పండి" అన్నట్లు చాలా కుతూహలంగా చూపులు కనపర్చాను.

మా ముందు వున్న పట్టాల వైపు చూస్తూ చెప్పాడు.

"ఈ మధ్య బంధువుల పెళ్ళికి వెళ్ళాం మాస్టారూ! పెళ్ళిలో మా ఆవిడ బంధు జనమంతా కలిశారు. తీరిగ్గా కూచొని కబుర్లు చెప్పకుంటున్నారు. ఇంతలో నేను అటువైపు వెళ్ళాను. సరిగ్గా నేను అక్కడకు రావడం చూసి ఒకావిడ, ఒకావిడ ఏమిటిలెండి మా ఆవిడ మేనత్త నావైపు వోరగా చూసి 'ఆ ... పద్మకు మాత్రం పెళ్ళికి ముందు 'లవ్‌లెటర్స్' రాలేదా? ఏంటి?" అంది. ఆ మాటతో నా భార్య నిలువు గుడ్లేసింది. అదీ సంగతి."

నాకు పూర్తిగా అర్థం కాలేదు.

నా మొహం చూసి అతనే చెప్పాడు.

"పెళ్ళైన మర్నాడే వొచ్చేశాం. ఇంటికి వొచ్చింది మొదలు మా ఆవిడ ఏడ్చిందే ఏడుపు. సినిమాకు రమ్మన్నా రాదు. ఇక్కడకు రమ్మన్నా రాదు. నిజంగా తనకేం తెలీదని. ఏవో లెటర్స్ వచ్చిన మాట నిజమేగాని తనకే పాపం తెలీదని ఒహటే కన్నీళ్ళు. నేను ఆ విషయం అప్పడే మర్చిపోయాను. మా ఆవిడ మేనత్తను చూసి 'ఆడాళ్ళలో ఇలాంటి వాళ్ళు కూడా వుంటారా?' అని ఆశ్చర్యపడ్డాను గాని మరేమీ ఆలోచించలేదు. ఆ విషయం తన వద్ద ప్రస్తావించను కూడా లేదు. ఆవిడగార్ని బుజ్జగించి, బ్రతిమాలి మళ్ళీ మామూలు మనిషిని చేసి ఇక్కడకు తీసుకురావడానికి ఇంత టైం తీసుకుంది."

నా ముఖంలో మారుతున్న రంగులు గమనించి –

"ఏమిటి మాస్టారూ?" అన్నాడు.

"ఏం లేదు" అన్నాను ముక్తసరిగా.

"మా పెళ్ళై రెండేళ్ళు. షుమారు ఏడువందల రోజులు గడిచిపోయాయి. నా భార్య ఎలాంటిదో ఆ మాత్రం తెలుసుకోలేనా?" అన్నాడు.

మౌనంగా తల ఆడించాను.

"అంతేకాదు మాస్టారూ! నిజంగా పొరపాటు జరిగివున్నా, మనిషైన వాడు క్షమించాలి. చెల్లి తప్పు చేసినా, అన్నతమ్ములు పొరపాటు చేసినా సహించమూ! అంతా మనమే అని నమ్మి వొచ్చిన భార్య అంత కంటె తక్కువ కాదు నా దృష్టిలో పెద్దవారు మీరేమంటారు?"

ఏమంటాను?

సుమారు 20 సంవత్సరాలు కాపురం చేసి ఒక చిన్న అనుమానంతో నా భార్యతో మాటలు లేకుండా, సాయంకాలాలు ఇట్లా స్టేషన్ దగ్గరకు వచ్చి కూచుంటున్న మామూలు మొగాన్ని, మొగుణ్ణి నేను. ఆ కుర్రాడికి ఏమని సమాధానం చెప్పగలను? కనీసం ఇహనుంచైనా నా భార్యను కూడా ఇలా సాయంకాలాలు హాయిగా గడపటానికి తీసుకువొస్తానని ఎట్లా చెప్పగలను? ఆకాశమంత ఎత్తుగా వున్న ఆ కుర్రాడి ముందు నోరు తెరవలేకపోయాను.

ఇంతలో ట్రైన్ రావడంతో అతను నా సమాధానం గాలికి వొదిలి "ఇప్పడే వొస్తాను మాస్టారూ" అంటూ ఆవిడ వైపు వెళ్ళాడు.

సిగ్గులేని ఈ ముఖంతో, పశ్చాత్తాపం నిండిన మనసుతో వడివడిగా ఇంటివైపు నడిచాను.

